క్లుప్తంగా

నేడు దత్త జయంతి

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం అనుబంధ దేవాలయమైన శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా దత్తజయంతి పూజలు నిర్వహించున్నట్లు ఈఓ మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలం జంగేడు, గొర్లవీడు, వజినేపల్లి, నేరేడుపల్లి గ్రామాల్లో భూమి పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ జంగేడు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేనిచో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు అర్హులు కారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 89777 68745కు ఫోన్ చేయాలన్నారు.

మిత్రుల చేయూత



సుజాతకు నగదు అందజేస్తున్న మిత్రులు

మల్హర్ : ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న స్నేహితురాలికి తోటి మిత్రులు చేయూత నందించారు. మండల కేంద్రమైన తాడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదోతరగతి చదివిన సుజాతకు తోటి స్నేహితులు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. సుజాత భర్త చనిపోవడంతో ముగ్గురు పిల్లలతో కష్టాల్లో ఉందని తెలుసుకొని తోటిమిత్రులు రూ.22వేల నగదును అందజేశారు. హాసిని, కల్పన, రజిత, శ్రావణి, నవత, నిరోష, స్వప్న, స్రవంతి ఉన్నారు.

అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

మల్హర్ : మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు ఎంపీడీఓ శ్రీనివాస్ బుధవారం స్వచ్ఛదనం, పచ్చదనం, పారిశుద్ధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అలాగే రేషన్ కార్డుల జారీపై కార్యదర్శులుకు ఇచ్చిన యాప్‌పై వారికి పలు సూచనలు చేశారు. సీజన్ వ్యాధులపై ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్ రవికుమార్, వైద్యాధికారి సూజైకిరణ్, వ్యవసాయ అధికారి శ్రీజ, మిషన్ భగీరథ ఏఈ రాజేఖర్, ఎంపీఓ విక్రమ్‌కుమార్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరం దాడి

మల్హర్ : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ సూర్యనారాయణరావు హెచ్చరించారు. మండలంలోని తాడిచర్లలో డీఎస్పీ సూర్యనారాయణరావు, కాటారం సీఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో కొయ్యూరు ఎస్సై నరేష్ బుధవారం రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించారు. గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన రవి వద్ద 24 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేశారు.

పరామర్శ

కాటారం : మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని బుధవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. పరికిపల్లికి చెందిన కుమ్మరి సారయ్య, కాటారంలో ముసపురి ఐలయ్య, పాడి రాజబాబు, అంకుషాపూర్‌లో మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై మధు ఆరా తీశారు. కొత్తపల్లిలో ఇటీవల మృతి చెందిన మల్లక్క కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ యూత్ నాయకుడు జక్కు రాకేశ్, జోడు శ్రీనివాస్, తోట జనార్దన్, పంతకాని సద్విలి, శ్రీలక్ష్మి చౌదరి, రమణ, వంగళ రాజేందర్ ఉన్నారు.

రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ



వెంకటాపురం(కె) : మండల పరిధిలోని పాత్రాపురం, ఆలుబాక రైతు వేదికల్లో బుధవారం మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు మండల వ్యవసాయ అధికారి నవీన్ పరిహారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొక్కజొన్న పంట నష్ట పోయిన రైతులకు కంపెనీల నుంచి మంజూరైన పరిహారం చెక్కులను రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఏఈఓలు శ్యామ్, శ్రీకన్య రైతులు ఉన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



టేకుమట్ల- చిట్యాల ప్రధాన రోడ్డులో శిథిలమైన లోలెవెల్ కల్వర్టు



టేకుమట్ల- అంకుషాపూర్ రహదారిలో..

- ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

టేకుమట్ల : చాలా ఏళ్ల క్రితం మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రోడ్లపై నిర్మించిన లోలెవల్ కల్వర్టులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు వెళ్లాలంటే భయపడుతున్నారు. పాకురు పట్టి కొన్ని కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా చిట్యాల–టేకుమట్ల ప్రధాన రహదారిలో నాలుగు లోలెవల్ కల్వర్టులు నిత్యం భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా శిథిలమైంది. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిలోని కల్వర్టులు ధ్వంసమైనా ఇప్పటి వరకు అధికారులు వాటి నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం దారుణమని స్థానికులు అంటున్నారు. టేకుమట్ల శివారులోని టేకులకుంట వద్ద గల కల్వర్టు వర్షాకాలంలో వరదకు మరింత కోతకు గురికాగా కొందరు కల్వర్టు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం సమీపంలోని కల్వర్టు మధ్యలో శిథిలం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శాంతినగర్ శివారులో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు మరింత ఆందోళన చెందుతున్నారు.

కుంగుతున్న అంకుషాపూర్–టేకుమట్ల లోలెవల్ కల్వర్టు..

టేకుమట్ల–అంకుషాపూర్ లోలెవెల్ పై నుంచి వచ్చే వరద వల్ల కల్వర్టుపై పాకురు పట్టి వాహనదారులు ప్రయాణించే సమయంలో జారిపడిన సంఘటనలు కోకొల్లాలు. వాహనదారులే కాకుండా కాలినడకన వెళ్లే వారు సైతం జారి పడుతున్నారు. హైలెవల్ కల్వర్టు నిర్మించాలని గతంలో అనేక సార్లు అధికారులకు, పాలకులకు మొరపెట్టుకున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం టేకుమట్ల–నవాబుపేట ప్రధాన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో కల్వర్టులను హైలెవల్ కల్వర్టులుగా నిర్మిస్తే మెరుగైన రవాణా సౌకర్యం కొనసాగుతుంది. అంతే కాని రోడ్డు నిర్మించినా, హైలెవల్ కల్వర్టులు నిర్మించకుంటే ప్రయాణికులకు మళ్లీ రవాణా తిప్పలు తప్పవని, ప్రస్తుతం రోడ్డు నిర్మాణంతో పాటు లోలెవల్ కల్వర్టులను హైలెవల్ కల్వర్టులుగా నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు



కాళేశ్వరం: ఏబీవీపీ జెండా ఆవిష్కరిస్తున్న సాయి తదితరులు

చిట్యాల : మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సాయి చరణ్, కృష్ణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలో (అఖిల భారతీయ విద్యార్థి పరిషత్) ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగర సాయి ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కూడా ఏబీవీపీ కీలక పాత్ర పోషించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిందని తెలిపారు. విద్యార్థులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: జెండా ఎగురవేస్తున్న నాయకులు

టిప్పర్లు, పొక్లెయినర్ సీజ్

రేగొండ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు, పొక్లెయినర్‌ను సీసీఎస్ పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో అక్రమంగా ఇసుకను లోడు చేస్తున్న పొక్లెయినర్, టిప్పర్లను మంగళవారం అర్ధరాత్రి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఇసుకను అక్రమంగా తరలించడానికి ప్రయత్నించిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఓటరు నమోదులో బీఎల్‌ఓలు కీలకం



బీఎల్‌ఓలతో తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్

కాటారం : ఓటరు నమోదులో బీఎల్‌ఓలు కీలకమని తహసీల్దార్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియ, జాబితా సవరణ తదితర అంశాలపై నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్ బీఎల్‌ఓలకు వివరించారు. నూతన ఓటరు నమోదు ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని బూత్ లెవల్‌లో ఓటరు జాబితా పక్కాగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'దాడి చేయడం సరికాదు'

టేకుమట్ల : కొన్ని రోజులుగా ప్రథమ చికిత్స కేంద్రాలపై డీఎంహెచ్‌ఓ, తెలంగాణ మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా దాడులు చేయడం సరైంది కాదని ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక చికిత్స అందిస్తున్న వారిపై కక్ష పూరితంగా దాడులు నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చి ప్రాథమిక చికిత్స కేంద్రాల నిర్వాహణకు సహకరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఆర్ఎంపీల ప్రథమ చికిత్స కేంద్రాలపై దాడులు నిలిపి వేయాలని వినతిపత్రాన్ని అందించారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎంపీలు

వరదలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యులు

వాజేడు : మండల పరిధిలోని రాష్ట్ర సరిహద్దులో గల టేకులగూడెం గ్రామస్తులకు ఎన్‌డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందం అధికారులు, వాజేడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడుతో కలిసి బుధవారం గోదావరి వరదలపై అవగాహన కల్పించారు. వరదలు రాక ముందు ఎలా ఉండాలి, వరదలు వస్తున్న సమయంలో ఎలా అప్రమత్తం కావాలి, చిక్కుకుంటే ఎలా రక్షణ కల్పించుకోవాలి వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా టేకులగూడెం గ్రామస్తులకు జాగ్రత్తలు తెలియజేశారు. ఎన్‌డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందం అధికారులు, ఇన్‌స్పెక్టర్ ముకేష్ కుమార్, ఏఎస్సై సుధీర్, కానిస్టేబుల్ జగదీశ్ తదితరులు ఉన్నారు.

మహిళలు అభివృద్ధిలో ముందుండాలి



ఏటూరునాగారం : సంబురాల్లో పాల్గొన్న మహిళలు, సెర్ప్ సిబ్బంది

వాజేడు : మహిళలు అభివృద్ధిలో ముందుండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. మండల పరిధిలోని రేగులపాడు గ్రామంలో బుధవారం ఇందిర మహిళా శక్తి సంబురాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పారిశ్రామికంగా ముందుగు సాగాలని సూచించారు. ఏఈఓ రాధిక, వీవో రజని, నాగమణి, సత్యనారాయణ ఉన్నారు.

మహిళా శక్తి సంబురాలు

ఏటూరునాగారం : మహిళలు పొదుపు చేస్తేనే కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని సెర్ప్ ఏపీఎం సతీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఇందిర మహిళా శక్తి సంబురాల్లో భాగంగా పోటీలు ఆటపాటలతో సంబురాలను జరుపుకున్నారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి, ఎదుగుదల మహిళలతోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో జ్యోతి, సీసీలు, వీఏఓలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

వాజేడు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, హౌసింగ్ ఏఈ ఇషాక్ హుస్సేన్ పరిశీలించారు. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని వారు సూచించారు. అలాగే ఇందిరమ్మ మోడల్ ఇంటికి శ్రీకాంత్ నాయుడు, ఇషాక్ హుస్సేన్ ముగ్గు పోయించారు. నెల రోజుల్లో ఇంటిని పూర్తి చేయనున్నట్లు వారు తెలిపారు.

మెగా వైద్యశిబిరం

ఏటూరునాగారం : మంత్రి సీతక్క జన్మదిన సందర్భంగా ఉద్యోగ జేసీపీఆర్ ఆర్ చారిటీ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మడుగురి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ స్థలంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు, అవసరమైన వారికి ఈసీజీ నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మడుగురి సుధాకర్, సంధ్య, పాలకుర్తి శ్రీనివాస్, సంజీవ్ గుల్లగట్టు, సంజీవ్, సత్యంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



గణపురం: కేటీపీపీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



గణపురం: సింగరేణి రామప్ప కాలనీ వద్ద నిరసన చేస్తున్న కార్మికులు

కాళేశ్వరం : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ మహదేవపూర్ మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మె నిర్వహించారు. బుధవారం సీఐటీయూ పిలుపు మేరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు జాతీయ రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, ప్రజాసంఘాలు మహదేవపూర్ మండల ప్రజాసంఘాల నాయకులు పోలం రాజేందర్, కుమ్మరి రాజు, సంయుక్త కిసాన్ మోర్చా సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమరశీల పోరాటాల ద్వారా కార్మిక వర్గం 100 సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడులను అమలులోకి తెస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం: మహదేవపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు

సమ్మెలో కేటీపీపీ, సింగరేణి ఉద్యోగులు

గణపురం : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో గణపురం మండలం చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం ఉద్యోగులు, బస్వరాజుపల్లి కాకతీయ లాంగ్ వాల్ ప్రాజెక్టు, మాధవరావు పల్లె ఓసీ–3 ప్రాజెక్టులో పని చేస్తున్న సింగరేణి కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. కేటీపీపీ ప్రధాన గేటు ఎదుట ఉద్యోగులు, రామప్ప కాలనీ వద్ద సింగరేణి కార్మికులు నిరసన వ్యక్తం చేసి విధులకు హాజరు కాలేదు.

కార్మిక సంఘాల సమ్మె

రేగొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక చర్యలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొన్నాయి. సమ్మెలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశ కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం అందజేశారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

టేకుమట్ల : సమస్యలు పరిష్కరించి, తమ డిమాండ్లను నెరవేర్చాలని బుధవారం ఆశ వర్కర్లు మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిభారం పెరుగుతున్న తరుణంలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని రూ.20వేల వేతనంతో పాటు, పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల ధర్నాకు సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు.



టేకుమట్ల: ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు



పలిమెల: మాట్లాడుతున్న టీఏజీఎస్ నాయకులు

జీఓ 49ను రద్దు చేయాలి

పలిమెల : కొమురం భీమ్ కన్జర్వేషన్ రిజర్వ్ జీఓ 49, కార్మిక వ్యతిరేక కార్పొరేట్ అనుకూల నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. బుధవారం టీఏజీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆదివాసీలతో కలిసి సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫారెస్ట్ కన్జర్వేషన్ రూల్స్ అటవీ చట్టాలు సవరణ పేరు అటవీ హక్కుల చట్టాన్ని, పీసా చట్టాలని నీరుగారుస్తూ ఆదివాసుల మనుగడకు ప్రశ్నార్థకం చేస్తుందన్నారు వెంటనే జీఓ 49 రద్దు చేయాలని హెచ్చరించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కారు కార్మిక, కర్షక, ఆదివాసీ, ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలను అనుసరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సూదుల శంకర్, మండల ప్రధాన కార్యదర్శి పెద్ది శేఖర్, ఉపాధ్యక్షుడు కోడి మోహన్, బీమా బిలన్, భాముస్, దుర్గ, బానిస రమేష్, తదితరులు ఉన్నారు.

కాటారం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలు కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం మండలంలో సార్వత్రిక సమ్మె కొనసాగింది. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్, కేడీసీసీ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు సమ్మెలో పాల్గొన్నారు. ప్రధాన కూడలిలో ఆశ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. జాతీయ రహదారిపై నిలబడి ఆందోళన నిర్వహించారు. తమ డిమాండ్‌లను వెంటనే పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు రాజేశ్వరీ, జయప్రద, పద్మ, రజిత, స్వరూప, పారుపతి, శైలజ, శారదా, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



రేగొండలో..



కాటారం: నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు



భూపాలపల్లి అర్బన్: సమ్మె కారణంగా నిర్మానుష్యంగా మారిన గని ఆవరణ

ఎమ్మార్పీఎస్‌తోనే ఎస్సీల వర్గీకరణ



ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దండోరా జెండాను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్ ఆవిష్కరించారు. అనంతరం మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ మాదిగ దండోరా ప్రస్థానం 31ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జల ప్రసాద్, పేరాల బలరాం, కడపాక శ్యామ్, అంబాల చంద్రమౌళి, భద్రు నాయక్, గజ్జల ప్రశాంత్, సమ్మన్న, రవీందర్ తదితరులు ఉన్నారు.